# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-03-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **అనకాపల్లి జిల్లాలో ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా పరిశ్రమకు భూమి పూజ చేయనున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రులు.**
2. **విశాఖపట్నంలో పర్యటిస్తున్న కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి.**
3. **ప్రభుత్వం రైతులను అన్నివిధాలా ఆదుకుంటుందని వెల్లడించిన దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి.**
4. **చేనేత కార్మికుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందన్న బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత.**
5. **ప్రపంచ వాతావరణ అవగాహన దినోత్సవాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు.**

==========================

అనకాపల్లి జిల్లా, నక్కపల్లి మండలం, రాజయ్యపేటలో ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా పరిశ్రమకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రులు హెచ్.డి కుమారస్వామి, భూపతిరాజు శ్రీనివాస వర్మలతో కలిసి ఈరోజు భూమి పూజ చేస్తారు. ఈ పరిశ్రమను సుమారు లక్షా 36 వేల కోట్ల రూపాయల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్నారు. ఏడాదికి 17.8 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ఈ పరిశ్రమ ఏర్పాటుతో లక్ష మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయని అధికారులు వెల్లడించారు. ఈ గ్రీన్ ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ను రెండు దశల్లో ఏర్పాటు చేయనున్నారు. దీనికి అనుబంధంగా 11 వేల 198 కోట్ల రూపాయలతో క్యాప్టివ్ పోర్ట్ ఏర్పాటు వల్ల మరో 6 వేల ఉద్యోగాలు లభించనున్నాయని అధికారులు తెలిపారు.

--------------------------

విశాఖపట్నంలో కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి ఈరోజు పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన స్టీల్ ప్లాంట్‌ను సందర్శించారు. ఈ మధ్యాహ్నం స్టీల్ ప్లాంట్ కార్మికులతో సమావేశం అవుతారు.

--------------------------

ప్రభుత్వం రైతులను అన్నివిధాలా ఆదుకుంటుందని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాముల నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలంలో మంత్రి ఈరోజు పర్యటించారు. ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించి అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అకాల వర్షాల కారణంగా జరిగిన పంట నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందజేయనున్నట్లు మంత్రి తెలిపారు.

---------------------------

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 11 వేల 5 వందల కోట్ల రూపాయల ప్యాకేజీని మంజూరు చేసిందని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. విశాఖపట్నంలో నిర్వహించిన పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ కార్యక్రమంలో శాసనసభ్యులు విష్ణుకుమార్ రాజుతో కలిసి ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ..

వాయిస్..30 సెకన్లు

---------------------------

జేఈఈ మెయిన్-2026 చివరి విడత పరీక్షలు వచ్చే నెల 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్నామని జాతీయ పరీక్షల సంస్థ(ఎన్‌టీఏ) ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పరీక్షకు సంబంధించిన అడ్వాన్స్ సిటీ ఇంటిమేషన్ స్లిప్పులు అందుబాటులో ఉంచినట్లు పేర్కొంది. అభ్యర్థుల పరీక్ష కేంద్రం ఏ నగరంలో ఉందో ముందుగానే తెలుసుకునేలా 'సిటీ ఇంటిమేషన్ స్లిప్' విడుదల చేసినట్లు వెల్లడించింది. అభ్యర్థులు తమ అప్లికేషన్ నంబరు, పాస్‌వర్డ్, సెక్యూరిటీ పిన్‌తో ఈ స్లిప్పులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఎన్‌టీఏ తెలిపింది.

---------------------------

రాష్ట్రంలోని చేనేత కార్మికుల అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో ఏర్పాటు చేసిన జాతీయ చేనేత వస్త్ర పదర్శనను ఆమె నిన్న సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చేనేత కార్మికులకు ముడి సరుకులపై సబ్సిడీతో పాటు అవసరమైన పరికరాలపై 90 శాతం వరకు సబ్సిడీ ఇస్తున్నామన్నారు. వచ్చే నెల నుంచి చేనేత మగ్గాలకు 200, మరమగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ ను అందజేయనున్నట్లు మంత్రి సవిత తెలియజేస్తూ...

వాయిస్..30 సెకన్లు

---------------------------

తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 30వ తేదీ నుంచి మూడురోజుల పాటు వసంతోత్సవాలను తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించనుంది. ఇందులో భాగంగా శ్రీ వెంకటేశ్వర స్వామివారు 3 రోజుల పాటు తిరమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు స్వామివారికి తిరుమంజనం నిర్వహించనున్నారు. వసంతోత్సవాల కారణంగా మార్చి 30వ తేదీ నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు తిరుమల శ్రీవారి ఆలయంలో జరిగే కల్యాణోత్సవం, ఊంజల్ సేవ , ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ, మార్చి 31న అష్టదళపాద పద్మారాధన సేవను దేవస్థానం రద్దు చేసింది.

---------------------------

వాతావరణ కాలుష్య నివారణా చర్యలపై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఈరోజు ప్రపంచ వాతావరణ అవగాహన దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వాతావరణ మార్పులను అంచనా వేయడం....., భూతాపాన్ని తగ్గించడం....,.ప్రకృతిని పరిరక్షించడం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారు. ప్రకృతి సమతూకాన్ని కాపాడుతూ ప్రస్తుత...., భవిష్యత్ తరాల వారికి ఉజ్వల భవిష్యత్ అందించడమే ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. 1950వ సంవత్సరం మార్చి 23న ప్రపంచ వాతావరణ సంస్థ ఏర్పాటైన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా ఈరోజును ప్రపంచ వాతావరణ అవగాహన దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.

-----------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 132 వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.“మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు, మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు, నరేంద్రమోదీ యాప్‌కు ఈ నెల 27వ తేదీ వరకు పంపవచ్చు.

-----------------------------

అనంతపురం నగర అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని శాసనసభ్యులు దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. అనంతపురంలోని నేషనల్ పార్క్ లో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు కు ఆయన ఈరోజు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ.. సుమారు 10 కోట్ల రూపాయల నిధులతో చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగా తొలి విడుదలతో 2 కోట్ల 6 2 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణం చేస్తున్నట్లు వివరించారు.

-----------------------------

భారత్ పురుషుల క్రికెట్ జట్టు జూన్‌లో ఐర్లాండ్‌తో రెండు టీ20 మ్యాచ్‌లు ఆడనుందని భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు – బీసీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మ్యాచ్‌లు జూన్ 26, 28వ తేదీల్లో ఉంటాయని బీసీసీఐ పేర్కొంది. ఐర్లాండ్ పర్యటన అనంతరం ఇంగ్లాండ్‌తో జూలై 1వ తేదీ నుంచి 19వ తేదీ వరకు 5 టీ20 మ్యాచ్‌లు, మూడు వన్డేలు ఆడుతుందని బిసిసిఐ వివరించింది.

-----------------------------

ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, దాని పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని అమరావతి లోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. అలాగే గల్ఫ్ ఆఫ్ మన్నార్ నుంచి పశ్చిమ విదర్భ వరకు ద్రోణి 0.9 కిలో మీటర్ల ఎత్తులో కొనసాగుతోందని అమరావతి వాతావరణ అధికారి ఎం. వెంకట్రావు పేర్కొంటూ..

వాయిస్.. 20 సెకన్లు

=====================